



# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 08-03-2025 | సంపుటి - 21 | సంచిక -317 | రూ : 4 | పేజీలు: 8




# వంటనూనె కొనుగోలును తగ్గించండి

(మొదటిపేజీ తరువాయి)

సిల్‌వాసా: తమ అదనపు బరువును తగ్గించుకోవాలని ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సూచించారు. అనేక వ్యాధులకు ఊబకాయమే ప్రధానకారణమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా, వంటనూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించడం ద్వారా శరీరంలోని అధిక కొవ్వును కరిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దాద్రానగర్ హవేలీలోని సిల్‌వాసాలో జరిగిన పలు అభివృద్ధి, ప్రారంభ, భూమిపూజ కార్యక్రమాల్లో మోదీ పాల్గొని ప్రసంగించారు. ''మన జీవనశైలితో ముడిపడిన వ్యాధులతో మన ఆరోగ్యానికి భారీ ముప్పు పొంచిఉంది. ఊబకాయం వాటిల్లో ఒకటి. ఇది అనేక వ్యాధులకు మూలకారణంగా నిలుస్తోంది. 2050 నాటికి దేశంలో ఊబకాయుల సంఖ్య 44 కోట్లకు చేరుతుందని ఓ నివేదిక పేర్కొంది. ఈ సంఖ్య చాలా పెద్దది..భయపెట్టేది. నివేదికలోని అంశం వాస్తవరూపం దాలిస్తే..ప్రతిముగ్గురిలో ఒకరు ఊబకాయంతో బాధపడతారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ప్రజలు తమ ప్రయత్నాన్ని ప్రారంభించాలి. అదేవిధంగా వంటనూనెల వాడకాన్ని 10 శాతం తగ్గించాలని గతంలోనే సూచించా. వంటనూనెల కొనుగోలును 10 శాతం తగ్గిస్తామంటూ ప్రతిఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం, సైక్లింగ్ తో ఊబకాయం దూరమవుతుంది'' అని మోదీ పేర్కొన్నారు. ప్రజలకు చౌకధరల్లో మందులను అందించేందుకు దేశవ్యాప్తంగా కొత్తగా మరో 25 వేల జన ఔషధి కేంద్రాలను ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు సుమారు రూ.30 వేల కోట్లు ఆదా అయ్యాయన్నారు.

*** 11 నుంచి మారిషస్ పర్యటనకు మోదీ**

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 11 నుంచి మారిషస్‌లో రెండు రోజులు పర్యటించనున్నారు. మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గులాం ఆహ్వానం మేరకు 12న జరిగే ఆ ద్వీపదేశ జాతీయ దినోత్సవాల్లో మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు

# ఆర్థిక శక్తిగా మహాలక్ష్మి

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాలు భిన్నంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వ్యవసాయాధారిత ఉపాధి పథకాలు అమలవుతుండగా.. పట్టణ ప్రాంతాలకు వ్యాపారానికి సంబంధించిన పథకాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించిన తర్వాత సెర్ప్, మెప్మాల పరిధిలో ఉమ్మడి పథకాల అమలుకు సమస్యలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో పట్టణీకరణ విస్తరించగా అనేక గ్రామాలు నగరపాలక, పురపాలికల్లోకి పరిధిలో చేరాయి. దీంతో సెర్ప్ పరిధిలోని 33,914 సంఘాలు మెప్మా పరిధిలోకి వెళ్లాయి. గ్రామాల్లోని సంఘాల్లో సభ్యులైన వారు పట్టణాలకు వలస వచ్చినప్పుడు వారికి పథకాలు అందడం లేదు. వీటన్నింటినీ మెప్మా పరిధిలోని సంఘాలను సెర్ప్‌లో విలీనం చేయాలని నిర్ణయించింది. దీనిద్వారా మొత్తం 5,69,360 సంఘాలు, 61,35,460 మంది సభ్యులు సెర్ప్ పరిధిలో ఉంటారు. విలీనంతో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర పథకాలు మహిళలకు సమానంగా అందుతాయి.

*** వృద్ధులతో స్వయం సహాయక సంఘాలు**

ఎస్‌హెచ్‌జీల నిబంధనల మేరకు ప్రస్తుతం 18 నుంచి 60 ఏళ్లలోపు వారే స్వయంసహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. 60 ఏళ్లు దాటిన వారిని తొలగించడంతో సెర్ప్ ప్రయోజనాలు పొందడం లేదు. పెరిగిన ఆయుర్దాయం, మారుతున్న కుటుంబ పరిస్థితుల్లో వృద్ధులకు ఆర్థిక అభద్రత, సామాజిక ఒంటరితనం, అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వృద్ధులను సంరక్షించడం, వారి అనుభవంతో లబ్ధి పొందేందుకు ఎస్‌హెచ్‌జీలలో వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని నిర్ణయించింది. 60 నుంచి 65 ఏళ్ల కేటగిరీలో ఉన్న వారందరితో వృద్ధుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 15 లక్షల మంది మహిళలు వృద్ధాప్య పింఛను పొందుతున్నారు. అందులో 7 లక్షల నుంచి 8 లక్షల మంది వృద్ధుల స్వయం సహాయక సంఘాల్లో చేరతారు. తద్వారా వారు సంఘ ప్రయోజనాలు, ఒంటరితనం నివారణ, ఆరోగ్య అవగాహన, బీమా, చట్టపరమైన హక్కులను పొందుతారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే దేశంలో కౌమార జనాభా అత్యధికంగా ఉంది. రాష్ట్రంలో 1518 సంవత్సరాల కిశోర బాలికలు 32 లక్షల మంది ఉన్నారు. కౌమారదశ వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, ఆరోగ్యం, విద్య, ఉపాధి అభివృద్ధి, వినూత్న కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు అన్ని జిల్లాల్లో 1518 సంవత్సరాల వయస్సు గల కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా వారు సాధికారతతో పాటు ఆరోగ్యం, అక్షర పరిజ్ఞానం, నాణ్యమైన విద్య పొందుతారు. వీరు యుక్తవయసు వచ్చాక ఎస్‌హెచ్‌జీలలో చేరతారు. మెప్మా పరిధిలోని సంఘాల విలీనం ద్వారా సెర్ప్ పరిధిలోని సభ్యుల సంఖ్య 61 లక్షలకు చేరగా.. కొత్తగా ఏర్పాటయ్యే 6065 సంవత్సరాల వృద్ధుల సంఘాల సభ్యుల సంఖ్య 8 లక్షలు, 1518 సంవత్సరాల కిశోర బాలికల సంఘాల సభ్యుల సంఖ్య 32 లక్షలతో కలిసి మొత్తంగా స్వయంసహాయక సంఘాల సభ్యుల సంఖ్య కోటికి చేరనుంది. కోటి మంది మహిళలు రూ.లక్ష కోట్ల రుణాన్ని పొందినప్పుడు నిజమైన మహిళా సాధికారత, నాయకత్వపు కొత్త శకాన్ని నడిపిస్తూ ఆర్థికశక్తి కేంద్రంగా మారుతుందని మహిళాశక్తి మిషన్ విధానంలో ప్రభుత్వం పేర్కొంది.

# దక్షిణాదిపై కేంద్రం డీలిమిటేషన్ కుట్ర

దిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. దక్షిణాది ప్రజలు భాజపాను ఆదరించడంలేదన్న కక్షతో.. కుట్రపూరితంగా డీలిమిటేషన్ ఆయుధాన్ని ప్రయోగిస్తోందని దుయ్యబట్టారు. అలా ప్రతీకారం తీర్చుకోవడానికి వీల్లేదని, దానివల్ల పంజాబ్‌లాంటి రాష్ట్రాలు కూడా నష్టపోనున్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశానికి నేతృత్వం వహిస్తున్నప్పటికీ గుజరాత్ పట్ల ప్రేమ చూపుతూ మిగతా రాష్ట్రాలపై వివక్ష కనబరుస్తున్నారని ఆరోపించారు. ఆయన శుక్రవారం ఇక్కడ జాతీయ ఛానల్ ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమ సంధానకర్తలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

*** గుజరాత్ మోడల్.. టెస్ట్ మ్యాచ్, మాది టీ-20**

''అభివృద్ధిలో గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది. అది టెస్ట్ మ్యాచ్‌లాంటి మోడల్. తెలంగాణ మోడల్ టీ20 లాంటిది. ఇదే ఇప్పుడు దేశానికి నమూనా. గుజరాత్‌లో సంక్షేమ విధానం లేదు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అన్నది తెలంగాణ మోడల్.

*** కేవలం గిఫ్ట్‌సిటీకే మినహాయింపు ఎందుకిచ్చారు?**

నేను మోదీ చర్యలను మోసపూరితం అని చెప్పడంలేదు. అయితే ప్రధాన మంత్రి స్థానంలో ఉన్న వారు విపక్ష చూపకూడదని పేర్కొంటున్నా. ఆయన భారత్‌కు వచ్చే విదేశీ పెట్టుబడిదారులందర్నీ గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీకి తీసుకెళ్తున్నారు. అక్కడ పెట్టే పెట్టుబడులపై వచ్చే లాభాలను మళ్లీ వాళ్ల దేశాలకు తీసుకుపోవచ్చని భరోసా ఇస్తున్నారు. దేశంలోని మరే ప్రాంతానికీ అలాంటి అవకాశం కల్పించలేదు. కేవలం గిఫ్ట్‌సిటీకే మినహాయింపు ఎందుకిచ్చారు? హైదరాబాద్‌కు ఎందుకు అలాంటి అవకాశం ఇవ్వడంలేదు?

**పార్టీ వేరు.. ప్రభుత్వం వేరు**

నాకు ప్రధాని మోదీతో వ్యక్తిగత విరోధం ఏమీ లేదు. విధానాలను ప్రశ్నిస్తున్నాను తప్పితే వ్యక్తిని కాదు. దేశ ప్రధానమంత్రిని గౌరవించడం, కలవడం, రాష్ట్రానికి సంబంధించిన డిమాండ్ల గురించి అడగడం ముఖ్యమంత్రిగా నా హక్కు. సీఎంగా కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తా. పార్టీ వేరు, ప్రభుత్వం వేరు. మా పార్టీ వేదికపై నిల్చున్నప్పుడు కచ్చితంగా పార్టీ విధానం ప్రకారమే మాట్లాడతా.

**అప్పులు, వడ్డీలకే నెలకు రూ.6,500 కోట్లు**

తెలంగాణ అప్పులు రూ.7 లక్షల కోట్లకు చేరాయి. 2014లో తెలంగాణ ఏర్పాటుచేసి కేసీఆర్ చేతుల్లో పెట్టినప్పుడు కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమే అప్పు ఉండేది. చంద్రశేఖర్‌రావు పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి మా తలపై వేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయం నెలకు రూ.18,500 కోట్లు ఉంటే అందులో జీతాలు, పింఛన్లకు రూ.6,500 కోట్లు, అప్పులు, వడ్డీలకు రూ.6,500 కోట్లు చెల్లించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. మిగిలిన మొత్తంతో అభివృద్ధి, సంక్షేమం చేయాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీల లెక్కలు సేకరించడానికి చట్టపరంగా అవకాశం కల్పించినప్పుడు బీసీలకు ఎందుకు కల్పించరు అన్న ఉద్దేశంతోనే మేం కులగణన చేసి చూపించాం. బీసీ లెక్కలు తీస్తే వారికి విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందన్న ఉద్దేశంతోనే భాజపా దేశంలో కులగణన చేపట్టకుండా వారికి అన్యాయం చేస్తోంది.

*** మోదీని ప్రశ్నించవచ్చనే హిందీ నేర్చుకున్నా**

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దక్షిణాది పార్టీలు అన్నీ ఒక్కటిగా లేకపోయినా ప్రజలు మాత్రం ఏకతాటిపై ఉన్నారు. హిందీని పట్టుకొని మా నెత్తిన రుద్దడానికి ప్రయత్నించడం మంచిదికాదు. హిందీని ఆప్షనల్‌గా ఉంచితే ఎవ్వరికీ ఇబ్బందిలేదు. రాజకీయాల్లో హిందీ వల్ల ప్రయోజనం ఉంటుందని, మోదీని ప్రశ్నించవచ్చనే నేను హిందీ నేర్చుకున్నా. భాజపా మాదిరి ఎన్నికల్లో గెలవాలంటే నైస్ (నార్కొటిక్స్, ఈడీ, ఇన్‌కంట్యాక్స్, సీబీఐ)లు అనుబంధ సంస్థల్లా మాతోపాటు ఉండాలి. ఆ పార్టీ వాటితో ఫోన్ చేయించి వెంటనే ఎవరి మెడలోనైనా భాజపా కండువా వేయించే సూత్రాన్ని అమలుచేస్తోంది. భాజపా బలం ఇదే. కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యయుతంగా పనిచేస్తుంది.. అదే దాని బలహీనత. 50 ఏళ్లు పదవులు అనుభవించినవారు కూడా ఒకసారి ఇవ్వకపోతే పోయి జంతర్‌మంతర్‌లో ధర్నా చేసే స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉంటుంది. భాజపాలో ఆడ్వాణీ, మురళీమనోహర్‌లాంటివారిని పక్కనపెట్టినా అడిగేవారు ఉండరు. ఒలింపిక్స్ నిర్వహణకోసం అహ్మదాబాద్‌కంటే హైదరాబాద్‌కే ఎక్కువ అర్హత ఉంది. దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు లేఖరాశా. అహ్మదాబాద్‌తో పోలిస్తే మా మౌలికవసతులు 100 రెట్లు ఉత్తమంగా ఉన్నాయి. కావాలంటే నిజనిర్ధారణ కమిటీతో తనిఖీ చేయించి ఆ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చు. మేలో మిస్‌వరల్డ్ పోటీలకు వేదికవుతున్న హైదరాబాద్‌లో ఒలింపిక్స్ ఎందుకు నిర్వహించకూడదు'' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

*** ఎన్నికల్లో వాగ్దానాల పరుగుపోటీ నడుస్తోంది**

ఇప్పుడు ఎన్నికల్లో వాగ్దానాల పరుగు పోటీ నడుస్తోంది. ఒకసారి ఈ పోటీలో దిగిన తర్వాత పరుగులు తీయాల్సిందే. దేశవ్యాప్తంగా ఉచిత వాగ్దానాలకు వ్యతిరేకంగా ప్రచారంచేసిన మోదీ దిల్లీలో ఉచిత గ్యారంటీలు ఇచ్చారు. ఒక దేశం ఒక ఎన్నిక, డీలిమిటేషన్‌లాంటి విషయాలపై కాకుండా ఉచితాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలని కోరుతున్నా. ఈ పథకాల కారణంగా మూలధన వ్యయంకోసం ఆర్థిక వనరులు అందుబాటులో ఉండటంలేదు. రాష్ట్రంలో నెలకు కనీసం రూ.500 కోట్లు కూడా మూలధన వ్యయం కోసం ఖర్చుచేయలేని పరిస్థితి ఉంది.

*** భాజపా దక్షిణాది గొంతు కోయాలని చూస్తోంది**

భాజపా దక్షిణాది గొంతు కోయాలని చూస్తోంది. డీలిమిటేషన్‌కు జనాభాను ఎందుకు ప్రాతిపదికగా తీసుకుంటారు? ఒకవేళ దాన్నే ప్రాతిపదికగా తీసుకోవాలనుకుంటే కుటుంబ నియంత్రణ అమలుచేయని సమయంలో తీసిన 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోండి. లేదంటే డీలిమిటేషన్‌ను 30 ఏళ్లు వాయిదా వేయండి. డీలిమిటేషన్‌కు దామాషా నిష్పత్తిని అనుసరిస్తామని కేంద్రహోంమంత్రి అమిత్‌షా చెప్పిన మాటకు అర్థమేంటో తెలియాలి. ఈ విషయంలో ఎవరికీ అన్యాయం చేయకూడదన్న ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి ఉంటే అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేయడంలేదు? బ్యూరోక్రాట్లకు ఎందుకు వదిలిపెడుతున్నట్లు?

# నాయక్ సినిమాలో ప్రధాన పాత్రధారిని అనిపించింది

*** దిల్లీ సీఎం పదవి దక్కడంపై రేఖా గుప్తా వ్యాఖ్యలు**

దిల్లీ: బాలీవుడ్ హిట్ చిత్రం 'నాయక్'లో ప్రధాన పాత్రధారిగా నటించిన అనిల్ కపూర్‌కు ఊహించని విధంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టే అవకాశం వస్తుంది. దిల్లీ సీఎంగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన భాజపా నేత రేఖా గుప్తా తాజాగా ఆ పాత్రతో తనను తాను పోల్చుకున్నారు. సీనియర్ నేతలను కాదని సీఎం పదవి తనను వరించినప్పుడు తాను 'నాయక్'లో ప్రధాన పాత్రధారినని అనిపించిందని, అయితే ఈ అవకాశం కేవలం అదృష్టంతో దక్కింది కాదని, భరతమాత పుత్రికలందరికీ దక్కిన గౌరవమని పేర్కొన్నారు. దిల్లీలో శుక్రవారం ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా సారథ్య ప్రభుత్వాలు, మహిళల నేతృత్వంలో పురోగతిపై ప్రధాని మోదీకి ఉన్న విశ్వాసంతోనే తనను ఈ పదవికి ఎంపిక చేసినట్లు చెప్పారు. సీఎం హోదాను పదవిలా కాకుండా బాధ్యతలా భావిస్తానన్నారు. యమునా నదిని శుభ్రం చేయడం, చెత్త దిబ్బలను నిర్మూలించడం, కాలుష్యాన్ని నివారించడం.. ఇలా ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

**శీష్ మహల్‌లో కూర్చొని పనిచేసే సీఎంను కాను**

ఆప్ అధికారంలో ఉన్నంత కాలం దేశరాజధాని అభివృద్ధికి నోచుకోలేదని రేఖా గుప్తా ఆరోపించారు. ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రజల గురించి ఆలోచించకుండా శీష్‌మహల్ నిర్మించుకోవడంలో బిజీగా గడిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనలా తాను మహల్‌లో కూర్చొని పని చేసే సీఎంను కానన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పని చేసే ముఖ్యమంత్రినని చెప్పారు.

# ఎండలు ముదురుతున్నాయ్.. జాగ్రత్త!

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల మొదటి వారంలోనే ఉష్ణోగ్రత 40 డిగ్రీలను తాకింది. రాష్ట్రంలోని 301 మండలాలు 'హీట్ వేవ్స్' నమోదయ్యే ప్రాంతంలో ఉన్నాయని, వడగాలుల ముప్పు సైతం పొంచి ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే అప్రమత్తం చేసింది. తెలంగాణ ప్రాంతం మెట్ట నేలలతో కూడుకుని ఉండటంతో భూమి త్వరగా వేడెక్కుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఈ భూములు ఎక్కువగా ఉండటంతో అక్కడ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లోనూ ఎండలు తీవ్రంగా ఉంటున్నాయి. వేసవిలో రాజస్థాన్ నుంచి గాలులు రాష్ట్రం వైపు వీస్తుండటమూ వేడి పెరగడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఏ స్థాయిలో ముప్పు: ఒక ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 4.5 డిగ్రీల నుంచి 6.4 డిగ్రీల వరకు పెరిగినప్పుడు, ఉష్ణోగ్రత 45 డిగ్రీలను దాటినప్పుడు హీట్‌వేవ్‌గా పరిగణిస్తారు. ఈ జోన్‌లో ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో అత్యంత తీవ్ర వడగాలుల ముప్పున్న ప్రాంతాల్లో 9.98 లక్షల మంది (6 మండలాలు), తీవ్ర ముప్పున్న ప్రాంతాల్లో 50.64 లక్షల (106 మండలాలు), ముప్పున్న ప్రాంతాల్లో 1.06 కోట్ల మంది (189 మండలాలు) జీవిస్తున్నారు. రాష్ట్రంలో దశాబ్ద కాలంలో వడదెబ్బతో 1,403 మంది మృత్యువాత పడ్డారు. 2015లో అత్యధికంగా 541 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆరుబయట పనిచేసే కూలీలకు, కార్మికులకు, ప్రయాణాలు చేసేవారికి, వృద్ధులకు, మూత్రపిండాల వ్యాధుల బాధితులకు వడదెబ్బ ముప్పు ఎక్కువ.

# 10న గ్రూప్1 ఫలితాలు

హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్1, 2, 3 సర్వీసుల పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షల ఫలితాల వెల్లడికి టీజీపీఎస్సీ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 10 నుంచి 19 వరకు మొత్తం ఐదు నోటిఫికేషన్లకు సంబంధించిన జనరల్ ర్యాంకు జాబితాలు, ప్రాథమిక మార్కులను వెల్లడించనుంది. రాష్ట్రంలో 563 గ్రూప్1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కుల వివరాలను ఈనెల 10న వెల్లడించనున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు. అనంతరం రోజుల వ్యవధిలోనే గ్రూప్2, 3 ఫలితాలను ఇస్తామన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బోర్డు సమావేశం... పెండింగ్‌లోని ఉద్యోగ ప్రకటనల పరిస్థితిని సమీక్షించింది. వాటి ఫలితాలు, జనరల్ ర్యాంకుల వెల్లడికి షెడ్యూల్‌ను ఆమోదించింది. గ్రూప్1 నోటిఫికేషన్ వెలువడిన ఏడాది వ్యవధిలోనే మార్కుల వివరాలు వెల్లడికి ఏర్పాట్లు చేయడం కమిషన్ చరిత్రలో రికార్డుగా నిలవనుంది. ఈ పరీక్షలో అభ్యర్థులకు వచ్చిన సబ్జెక్టుల వారీగా మార్కులను వ్యక్తిగత లాగిన్‌లో కమిషన్ పొందుపరచనుంది.

**తప్పుడు ప్రచారం నమ్మవద్దు...**

గ్రూప్1 నియామకాలకు సంబంధించి తప్పుదోవపట్టించే సమాచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు ఛైర్మన్ సూచించారు. ''టీజీపీఎస్సీ రాజ్యాంగబద్ధమైన సంస్థ. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రతిభావంతులైన అభ్యర్థులను కమిషన్ తన నియమ నిబంధనలకు లోబడి ఎంపిక చేస్తుంది. ఇటీవల సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో జరిగిన ప్రచారంపై కమిషన్ సీరియస్‌గా స్పందించింది. సంబంధిత వ్యక్తులపై పోలీసు కేసుల నమోదుతోపాటు, పరువునష్టం దావా కూడా వేశాం. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా మధ్యవర్తులు తప్పుడు వాగ్దానాలు చేస్తే... వారిపై అభ్యర్థులు వెంటనే సంబంధిత ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సమగ్ర సమాచారంతో కమిషన్ మొబైల్ నంబరు, ఈమెయిల్ (99667 00339, vigilance@tspsc.gov.inz)కు సైతం ఫిర్యాదు చేయవచ్చు. కమిషన్ పారదర్శకంగా నియామకాలు చేపడుతోంది. మధ్యవర్తులు తప్పుడు వాగ్దానాలు, హామీలు ఇచ్చినట్లు ఇప్పటివరకు ఒక్క ఫిర్యాదు రాలేదు. కానీ సోషల్ మీడియాలో తప్పుడు ఉద్దేశంతో, అభ్యర్థులు, యువతను గందరగోళానికి గురిచేయాలనే ఉద్దేశంతో అబద్ధపు ప్రచారం జరిగింది. కమిషన్ వెంటనే సంబంధిత మీడియాపై తక్షణ చర్యలు తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది'' అని ఛైర్మన్ వెల్లడించారు.

# 4 కమిషనరేట్లకు కొత్త సారథులు

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారుల్ని ప్రస్తుతమున్న కీలక స్థానాల నుంచి తప్పించి లూప్‌లైన్‌కు పంపారు. వెయిటింగ్‌లో ఉంటూ తాత్కాలిక పోస్టింగుల్లో ఉన్న పలువురు ఎస్పీలకు తాజాగా అవకాశం కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కువ మందికి స్థాన చలనం కలిగించడం ఇది రెండోసారి. గతేడాది జూన్‌లో 24 మంది ఎస్పీ స్థాయి అధికారులను మార్చారు. సెప్టెంబరులో డీజీపీ, అదనపు డీజీపీ, ఐజీపీ స్థాయి హోదా కలిగిన 15 మంది ఉన్నతాధికారులను మార్చారు. డిసెంబరులో 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన 10 మంది ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. రెండు వారాల క్రితం ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయిలోని 8 మంది అధికారులను మార్చారు.

* తాజా బదిలీల్లో భాగంగా తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా ఉన్న 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి డా.అనిల్‌కుమార్‌కు అదనపు డీజీపీ (పర్సనల్)గా పూర్తి అదనపు బాధ్యతల్ని అప్పగించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్ని శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేశ్‌భగవత్ నిర్వర్తించారు.

* కీలకమైన రామగుండం కమిషనరేట్‌కు 2009 బ్యాచ్ ఐపీఎస్, డీఐజీ అంబర్‌కిషోర్ ఝాను నియమించారు. ఆయన ఇప్పటివరకు వరంగల్ కమిషనర్‌గా పనిచేశారు.

* ఇటీవలే డీఐజీగా పదోన్నతి పొందిన 2011 బ్యాచ్ ఐపీఎస్ సన్‌ప్రీత్‌సింగ్‌ను వరంగల్ కమిషనర్‌గా నియమించారు.

* కేంద్ర హోంశాఖ ఆదేశాలతో డీఐజీ అభిషేక్ మహంతి తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ అయి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో ఖాళీ అయిన కరీంనగర్ కమిషనర్ స్థానానికి 2017 బ్యాచ్ ఐపీఎస్ గౌష్ ఆలంను నియమించారు.

* కల్మేశ్వర్ సింగెనవార్ కేంద్ర సర్వీసులకు వెళ్లిన తర్వాత నుంచి ఇన్‌ఛార్జి పాలనలో ఉన్న నిజామాబాద్ కమిషనర్ స్థానాన్ని 2016 బ్యాచ్ ఐపీఎస్ సాయిచైతన్యతో భర్తీ చేశారు.

# దిల్లీని మించేలా రాష్ట్ర విద్యా మోడల్

(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గ సమావేశంలో ఉపాధ్యాయుల బదిలీ చట్టాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో ఉపాధ్యాయులు ఎక్కడికి బదిలీ అవుతారనే విషయం కూడా తెలిసేలా దీన్ని రూపొందిస్తున్నామన్నారు. అమరావతిలో ప్రపంచస్థాయి ఉపాధ్యాయ శిక్షణ సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యావ్యవస్థకు కీలకమైన ఉపాధ్యాయులు.. అనవసరమైన యాప్‌లు, ఒత్తిడి, రాజకీయ జోక్యం కారణంగా పిల్లలకు సరిగా పాఠాలు చెప్పలేకపోతున్నారని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వీటన్నింటికీ పరిష్కారాన్ని చూపుతూ సంస్కరణలు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు కొణతాల రామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పార్థసారథి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

**స్కూల్ బ్యాగ్ బరువు తగ్గించేలా పాఠ్యపుస్తకాలు**

'స్కూల్ బ్యాగ్ బరువు తగ్గించేలా సెమిస్టర్ పాఠ్యపుస్తకాలన్నీ కలిపి బైండ్ చేసి ఇవ్వబోతున్నాం. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా కార్యచరణ చేపట్టాం. చాగంటి కోటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక పుస్తకాలను రూపొందిస్తున్నాం. విద్యార్థులకు అర్థమయ్యేలా రాజ్యాంగంపై పుస్తకాలు తయారుచేసి పంపిణీ చేస్తాం. వందమంది భారత స్వాతంత్ర్య పోరాటయోధుల చరిత్రతో కూడిన ఫ్లాష్‌కార్డులను పంపిణీ చేస్తాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి వీటిని అమలు చేయబోతున్నాం. వన్ క్లాస్ వన్ టీచర్ అనే సంస్కరణను మంత్రి నారాయణ సూచించారు. దీన్ని కనీసం 10 వేల పాఠశాలల్లో అమలుచేస్తాం.




# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 08-03-2025 | సంపుటి - 21 | సంచిక - 317 | రూ : 4 | పేజీలు: 8




# ఆర్థిక శక్తిగా మహాలక్ష్మి

- కోటి మంది మహిళలకు రూ.లక్ష కోట్ల రుణం
- సంఘటితం.. సంస్థాగతం.. సాధికారత లక్ష్యం
- ఒకే గొడుగు కిందకి గ్రామీణ, పట్టణ సంఘాలు
- కొత్తగా కిశోర బాలికలు, వృద్ధులతో గ్రూపుల ఏర్పాటు
- ఇందిరమ్మ మహిళాశక్తి మిషన్-2025 విధానం
- నేడు మహిళాశక్తి సభలో ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్: తెలంగాణలో కోటి మంది మహిళలను సంఘటితం చేసి, వారందరినీ కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఇందిరా మహిళాశక్తి మిషన్2025 పథకాన్ని శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించనున్నారు. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఈ పథకాన్ని ఆమోదించింది. శనివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని ప్రారంభించనుంది. గ్రామీణ, పట్టణ మహిళలను, యువతులను, వృద్ధ మహిళలను ఒకే గొడుగు కిందకు చేర్చి, ఆర్థిక స్వాతంత్ర్యం, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ ద్వారా వారిని శక్తిమంతం చేయడమే దీని ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

### ఐకమత్యమే మహాబలం

ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) పరిధిలో 4,34,368 మహిళా సంఘాలు, వాటిలో 46,85,460 మంది సభ్యులున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కింద 1,34,992 మహిళా సంఘాలున్నాయి. వాటి పరిధిలో 14.50 లక్షల మంది సభ్యులున్నారు. రెండు సంస్థల పరిధిలో సంఘాలకు బ్యాంకు లింకేజీ ఒకే తీరుగా ఉన్నా.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ

తరువాయి 2లో

# 'విశ్రాంతి తీసుకుంటారా లేదా సస్పెండ్ చేయించమంటారా?'

- అనారోగ్యంతో సభకు వచ్చిన రామానాయుడితో మంత్రి లోకేశ్

అమరావతి, పాలకొల్లు : 'విశ్రాంతి తీసుకుంటారా? లేకపోతే సభ నుంచి సస్పెండ్ చేయించమంటారా' అని మంత్రి నిమ్మల రామానా యుడిని మంత్రి లోకేశ్ సరదాగా ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో చేతికి ఐవీ కాన్యులాతో రామానాయుడు ఎదురుపడినప్పుడు ఆయన్ను ఆపి లోకేశ్ మాట్లాడారు. 'నిన్న ఈ చేతి(ఎడమ)కి, ఈ రోజు కుడి చేతికి కాన్యులా పెట్టుకుని వచ్చారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తానంటే చూస్తూ ఉండబోయేది లేదు. సస్పెండ్ చేయించాల్సిందే' అని అన్నారు. 'లేదు.. నిన్నటికంటే ఈ రోజు కొంత మెరుగ్గా ఉన్న. అందువల్లే సభకు వచ్చా' అని రామానాయుడు తిరిగి సమాధానమిచ్చారు. అంతకుముందు కూడా సభలో నిమ్మల అనారోగ్యంపై చర్చ జరిగింది. నిమ్మల పని రాక్షసుడంటూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించగా.. మంత్రి లోకేశ్ స్పందిస్తూ 'గురువారం కూడా జ్వరంతోనే మండలికి నిమ్మల హాజరయ్యారు. విశ్రాంతి తీసుకోమని చెబుతున్నా.. వినడం లేదు. మీరైనా రూలింగ్ ఇస్తే వింటారేమో అధ్యక్షా' అని పేర్కొన్నారు.



# దిల్లీని మించేలా రాష్ట్ర విద్యా మోడల్..

- చరిత్రలో తొలిసారిగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా
- వచ్చే మంత్రివర్గ సమావేశం ముందుకు ఉపాధ్యాయుల బదిలీ చట్టం
- విద్యాశాఖను ఛాలెంజ్‌గా తీసుకున్నా
- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడి



అమరావతి: విద్యావ్యవస్థలో ఇటుకపై ఇటుక పేర్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తున్నామని, 2025 జూన్ నాటికి ఇవన్నీ పూర్తవుతాయని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలందరూ కలిసికట్టుగా ఈ సంస్కరణలను ముందుకు తీసుకెళితే దిల్లీని మించేలా ఆంధ్రప్రదేశ్ మోడల్‌ను ప్రపంచానికి పరిచయం చేయవచ్చని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పారదర్శకంగా ప్రకటించబోతున్నామని తెలిపారు. వచ్చే

తరువాయి 2లో



# దక్షిణాదిపై కేంద్రం డీలిమిటేషన్ కుట్ర

- ఆయా రాష్ట్రాల ప్రజలు భాజపాను ఆదరించడం లేదనే కక్షతోనే..
- రాష్ట్రాలపై వివక్ష ప్రదర్శిస్తున్న ప్రధాని మోదీ
- ఒలింపిక్స్ నిర్వహణకు హైదరాబాద్ అత్యుత్తమ నగరం
- అహ్మదాబాద్‌తో పోలిస్తే 100 రెట్లు ఉత్తమం
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

# వంటనూనె కొనుగోలును తగ్గించండి

- వ్యాయామం, సైక్లింగ్‌తో ఊబకాయం తగ్గుతుంది
- ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

2లో



# 10న గ్రూప్1 ఫలితాలు

- 11న గ్రూప్-2, 14న గ్రూప్-3..
- మధ్యవర్తులు సంప్రదిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయండి
- అభ్యర్థులకు టీజీపీఎస్సీ ఛైర్మన్ సూచన

2లో

TELANGANA PUBLIC SERVICE COMMISSION

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్



# 4 కమిషనరేట్లకు కొత్త సారథులు

- రామగుండం కమిషనర్‌గా అంబర్‌కిషోర్ ఝాకు పోస్టింగ్
- వరంగల్‌కు సన్‌ప్రీత్‌సింగ్.. నిజామాబాద్‌కు సాయిచైతన్య
- ఏపీకి వెళ్లిన అభిషేక్ మహంతి స్థానంలో కరీంనగర్‌కు గౌష్ ఆలం
- భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్: రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం కలిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ముగిసిన వెంటనే పలువురు కమిషనర్లను, ఎస్పీలను మారుస్తారనే అంచనాలకు తగ్గట్టుగానే కీలక కమిషనరేట్లు, జిల్లాలకు కొత్త బాస్‌లను నియమిస్తూ శుక్రవారం

తరువాయి 2లో

# ఎండలు.. ముదురుతున్నాయ్.. జాగ్రత్త!

- పదేళ్లలో వడదెబ్బతో 1,403 మంది మృత్యువాత
- 13 జిల్లాల్లో ఏటా తీవ్రస్థాయిలో వడగాలులు

హైదరాబాద్: నిప్పులు చెరిగే ఎండలు, తీవ్ర వడ గాలులతో ఈ వేసవిలోనూ సూర్యుడి భగభగలను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈసారి ఫిబ్రవరి చివరి వారం నుంచే ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి.

తరువాయి 2లో



## ఘనంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి జన్మదిన వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి నివాసంలో నాయశ్రీ ఫౌండేషన్ సంబంధించిన అనాధ పిల్లలతో , స్థానిక నాయకులు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల మధ్య కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నాయశ్రీ ఫౌండేషన్ వారికి ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తన జన్మదినము నాయశ్రీ ఫౌండేషన్ కి సంబంధించిన అనాధ పిల్లలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ వారు అనాధ పిల్లలను చేరదీసి దాతల సహకారంతో వాళ్ళని స్కూల్లో చేర్పించి చదివించి వాళ్ళ కుటుంబ సభ్యుల లాగా వాళ్లను చూసుకుంటున్నందుకు వారిని అభినందనలు తెలిపారు. దానిలో భాగంగా వారికి ఫ్యాన్లు అవసరం ఉన్నాయని చెప్పినందున వారికి ఫ్యాన్లను విరాళంగా ఇవ్వడం జరిగిందని అన్నారు.

## ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు

*** ఉపాధ్యాయినీలకు ఘన సన్మానం**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయునీలకు ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయినీలకు పలు పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయినీల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ పోటీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజ్ మహమ్మద్, లక్ష్మణ్, శ్రీమతి, జ్యోతి రాణి, జోత్స్న, ప్రసాద్, శ్రీనివాస్, గోవర్ధన్, వీరస్వామి, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## బాలునిపై పిచ్చి కుక్కల దాడి

**- తీవ్రంగా గాయపడ్డ బాలుడు**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : తంగళ్ళపల్లి మండలం బదనపల్లి గ్రామంలో ఓ బాలునిపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. గ్రామంలలో సాయంత్రం 5గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటున్న 9 సంవత్సరాల బాలుడు జీవన్‌పై పిచ్చి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుని తలభాగంపై, చెవులు, శరీరంలో చాలా చోట్ల దాడి చేసి, గాయపరిచాయి. వెంటనే చుట్టుపక్కల వారు గమనించి కుక్కల దాడి నుండి బాలుని రక్షించి వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. కుక్కల బెడదతో ఇంట్లో నుండి బయటకు రావడానికి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా అంతర్ జాతీయ మహిళ దినోత్సవం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి): అంతర్ జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కూకట్పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా 6 వ అదనపు న్యాయమూర్తి పావని, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి ల తోపాటు సీనియర్,జూనియర్ కోర్టుల న్యాయమూర్తులు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా న్యాయవాదులతో పాటు ఇతర న్యాయవాదులు పాల్గొని మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ .కార్యక్రమంలో బారసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు నటరాజు, కార్యదర్శి యాదయ్య, బార అసోసియేషన్ మహిళా ప్రతినిధి సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# మీడియా పూర్తిగా బడా కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లింది

## * కార్మిక సంఘం జాతీయ నాయకులు ప్రసాద్







**(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ )**

గతంలో మాదిరిగా కాకుండా మీడియా పూర్తిగా బడా కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిందని కార్మిక సంఘం జాతీయ నాయకులు ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అధ్యక్షతన 'జర్నలిజం వృత్తి సంఘం' అనే అంశంపై, 33 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ కబంద హస్తాల్లోకి వెళ్లిన మీడియాను, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను రక్షించుకోడానికి ఉధృతంగా జర్నలిస్టు సంఘాలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ట్రేడ్ యూనియన్ ఆర్గనైజేషన్ గా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) చైతన్యవంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సామాజిక స్పృహ కలిగిన ఈ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘానికి ఎంతో ఉద్యమ చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం మీడియా రంగంలో వస్తున్న మార్పులపై జర్నలిస్ట్ సంఘం వర్క్ షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మునుముందు జిల్లా, మండల స్థాయిలో సైతం జర్నలిస్టులను చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.. గతంలో అక్షర జ్ఞానాన్ని అందించి వేతనాలు పొందిన జర్నలిస్టులు తదనంతరం వార్తలు పంపి టిప్స్ పొందే పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు యాజమాన్యాలు విధించే టార్గెట్స్ కనుగుణంగా యాజమాన్యాలకే జర్నలిస్టులు డబ్బులు ఇచ్చే దుస్థితి ఏర్పడిందన్నారు. యాజమాన్యాల టార్గెట్లతో మండల, డివిజన్ స్థాయిలో పనిచేసే జర్నలిస్టులు బెదిరిపోతున్నారని పేర్కొన్నారు. దీంతో సమాజంలో జర్నలిస్టుల పట్ల చులకన భావం ఏర్పడుతుందన్నారు. విధి నిర్వహణలో సామాజిక స్పృహతో ముందుకు వెళుతూ పరాయికరణ నుండి బయట పడాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాజంలో మళ్లీ పాత్రికేయుల పాత్ర కీలకమైన పరిస్థితులు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని, ఉత్తమ పౌరులుగా జీవించాలని ఆయన సూచించారు.

## మారుతున్న చట్టాలతో జాగ్రత్త కె.శ్రీనివాస్ రెడ్డి




మారుతున్న చట్టాలతో ప్రతి జర్నలిస్టు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐజేయూ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యమించి జర్నలిస్టుల సంక్షేమం కోసం సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 44 చట్టాలు ఉండగా 29 చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్ లుగా తెచ్చిందన్నారు. కొత్త చట్టాలు అన్నీ కూడా వేల కోట్ల పెట్టుబడిదారుల యజమానులకు అనుకూలంగా తయారు చేసినవేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న కొత్త చట్టాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సంఘ కార్యకలాపాలను నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. జర్నలిస్టులపై దాడులు జరిగితే మానవీయంగా ఆలోచించి ఖండించాల్సిన బాధ్యత జర్నలిస్టు సంఘాలపై ఉంటుందన్నారు. సంఘ ప్రయోజనం, ప్రతిష్టను దెబ్బతీసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై శ్రీనివాస్ రెడ్డి అవగాహన కల్పించారు. సంఘ బాధ్యుల పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ స్వాగతం పలకగా, ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ.మాజీద్, కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, బి.సంపత్, గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యదర్శులు వి.యాదగిరి, కె.శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కిరణ్, ఏ.రాజేష్, రాజేశ్వరి, డి.జి.శర్మ, ఎలగందుల రవీందర్, కె. రాజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ విద్యావేత్త ప్రొ. సూర్య ధనంజయ్ కు "ఉమెన్ ఆఫ్ ది 2025 అవార్డు" ప్రదానం..



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: అమెరికా చికాగో కు చెందిన సుబ్రదర్ అమిర్ అలీ ఖాన్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ అండ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటీలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య సూర్య ధనంజయ్ కి ఉమెన్ ఆఫ్ ది 2025 అవార్డు ను శాలువా మెమొంటో, పూలమాల కిరీటం, సర్టిఫికెట్ తో అవార్డు అంద చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిపుల్ కోడ్ చైర్మన్ జస్టిస్ వామన్ రావు దేశ్పాండే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో గత 30 సంవత్సరాలుగా అపారమైన సేవలందించి జాతీయ అంతర్జాతీయ సంస్థలతో ఎన్నో అవార్డులు తీసుకొని మహిళాభివృద్ధికి విద్య వ్యాప్తికి కృషి చేస్తున్న చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయకు ఈ అవార్డు ప్రదానం చేయడం గర్వకారణమని నిర్వాహకులు, వక్తలు అన్నారు. జస్టిస్ వామన్ రావు దేశ్పాండే మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో మహిళల స్వాభిమానం ఆత్మగౌరవం సమాన హక్కుల సాధనం కోసం జరుపుకునేదే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అన్నారు. స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే మార్చుకోవలిగే నిరంతరం జీవనాధార అవకాశాలు తామే స్వయంగా నిర్మించుకోగలిగే ఉన్నత స్థితికి చేరుకొని శ్రీ శక్తి ఏంటో ప్రపంచానికి తెలియ చెబుతూనే ఉన్నారని అన్నారు. సుబేదార్ అమీర్ పీస్ గ్లోబుల్ ఫౌండేషన్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు ఫరూక్ ఆలీ ఖాన్ మాట్లాడుతూ ఈరోజు మహిళలు ఒక పండుగలా అవగాహన కార్యక్రమాలతో సాగించాలని ప్రపంచవ్యాప్తంగా మహిళల పట్ల జరుగుతున్న హింసలను నిరసిస్తూ హక్కుల కోసం, న్యాయం కోసం జరిగే పోరాటాలకు నాందిగా జరుపుకోవాలని అన్నారు. అవార్డు గ్రహీత ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో అన్నింట సమానమని ఆకాశంలో సగం అని వారి అభివృద్ధికి ఆటంకం కలిగించడం అంటే ప్రజా సంక్షేమానికి గొడ్డలి పెట్టడం వంటిదే అని అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాజశేఖర్ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ విద్యాపరంగా మహిళలు విరిగిన నాడే సమాజం అన్ని రంగాలలో ముందుకు వెళుతుందని అన్నారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ ధనంజయ్ నాయక్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం జాతిని సరైన దశలో నడిపించే సాధనం కావాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ విద్యావేత్తలు ఇట్టా ఉదయశ్రీ రెడ్డి, యాస్మిన్ కౌసర్ కోఆర్డినేటర్లు రాజేందర్ ముదిరాజ్, కుమారి సృజన గౌడ్, కుమారి రేషు వైష్ణవి, కుమారి తాసిల్ సభ, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## రాజపేటలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎసిపి బృందం

రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం యాదగిరిగుట్ట ఏసిపి రమేష్ బృందం తనిఖీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్ష జరుగుతున్న సందర్భంలో ఆయన తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ హరిప్రసాద్ బృందం కూడా పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి పూర్తి వివరాలను చీఫ్ సూపరింటెంట్ వేణు ప్రసాద్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఏసీబీ వెంట రాజపేట ఎస్సై అనిల్ కుమార్ ఉన్నారు.





# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో పిజేర్ నగర్ యువశక్తి మహిళా మండలి హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్స్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై వైద్య పరీక్షల ప్రక్రియను పరిశీలించారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వైద్య నిపుణులు అందిస్తున్న సలహాలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన మహిళా మండలి వారికి , హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, పాండుగౌడ్, జి.రవి, పోశెట్టిగౌడ్, మహిళా మండలి సభ్యులు డి. గణిత, హెల్పింగ్ హార్ట్స్ సొసైటి ఫౌండర్ , అధ్యక్షులు టి.విజయ్ కుమార్, ఫణి కుమార్, జోహార్ సింగ్, రవి, మాధురి, సరిత, వాసంతి, ధనలక్ష్మి, షామిలి, నాగమణి, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సెహబాస్ రాహుల్ ...!

* **ఆదర్శం కెరీర్ గైడెన్స్**
* **అన్ని ఐటీడీఏల పరిధిలో అమలు చేయాలి**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వినూత్న ఆలోచనలకు పెట్టింది పేరు భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్. ఇటీవల కాలంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఆయన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాముని రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. గిరిజన విద్యాసంస్థల్లో కెరీర్ గైడెన్స్ సంబంధించి పోస్టర్ల ఏర్పాటు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రోగ్రాం సక్సెస్ ని ఇచ్చింది. విజయవంతంగా అమలవుతోంది. ఈ క్రమంలో ఈ కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం విషయం ట్రైబల్ వెల్ఫేర్ ప్రత్యేక సెక్రటరీ శరత్ దృష్టికి వెళ్ళింది. ఎంతో ప్రయోజనకరమైన ఈ ప్రోగ్రాముని ఆయన ఎంతగానో మెచ్చుకున్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ పై ప్రశంసల జల్లు కురిపించారు. ఇది అద్భుతమైన ఆలోచనని కితాబుని ఇచ్చారు. అంతేకాదు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో... భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ రూపొందించిన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాముని స్ఫూర్తిగా తీసుకొని అమలు చేయాలని ఆదేశాలు కూడా జారీ చేయడం జరిగింది. భద్రాచలం ఐటిడిఏ అమలు చేస్తున్న కెరీర్ గైడెన్స్ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో అమలు చేయాలని సెక్రటరీ సర్క్యులర్ జారీ చేయడం పిఓ రాహుల్ చర్యలపై ప్రశంసల జల్లు కురుస్తున్నాయి. గిరిజన విద్యా సంస్థల్లో విద్యా ప్రగతికి ఇప్పటికే అనేక విద్యా సంస్కరణలు తీసుకొస్తున్న పీవో రాహుల్ చేపట్టిన మరో సంస్కరణ సత్ఫలితాలు ఇవ్వడంతో అందరూ పిఓ ను అభినందిస్తున్నారు.

# మహిళా దినోత్సవం ఒక చారిత్రాత్మకంగా ఉండాలి

* **సింగరేణి కార్పొరేట్ సివిల్ ఏఈ క్రాంతి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని రైటర్ బస్తి డిపార్ట్మెంట్లోభారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మహిళా కార్మికులకు . బాంబే సిటీ స్పూన్ లిప్పింగ్, మ్యూజికల్ చైర్,రన్నింగ్ లాంటి క్రీడలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడలను సివిల్ కార్పోరేట్ ఏఈ క్రాంతి జె టి ఓ సాంబశివరావు ప్రారంభించారు.అనంతరం వారు ప్రసంగిస్తూ 118 వ మహిళా దినోత్సవం ఒక చారిత్రాత్మకంగా ఉండాలని వారు అన్నారు మహిళలు ఇంటికే పరిమితం కాకుండా బంధించబడకుండా ఆర్థిక రాజకీయ సామాజికంగా అభివృద్ధి చెందాలని సమానత్వం కై కృషి చేయాలని వారు అన్నారు. మహిళలు లేనిది సమాజమే లేదని వారన్నారు.అందుకే మహిళలకు అభివృద్ధి లేకుండా ఏ దేశ అభివృద్ధి కూడా లేదని అన్నారు.అన్ని రంగాలలో మహిళలు అభివృద్ధి చెందాలని ప్రపంచంలో ఏ రంగంలో చూసిన మహిళలపై ప్రధాన పై చేయిగా ఉన్నదని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సంజీవ్, ఏరియా కమిటీ నాయకులు కరుణ, నాగలక్ష్మి, పద్మ, సంధ్య, శాంత , నరసింహ, కృష్ణా, రామకృష్ణ , భగవాన్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 5వ తేదీన చర్ల పోలీసుల ఆధ్వర్యంలో మొదలయిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి.ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.ఎస్పీ తో పాటు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కూడా పాల్గొన్నారు. మూడు రోజులు పాటు జరిగిన ఈ మండల స్థాయి వాలీబాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని చత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన ఏజెన్సీ గ్రామాల నుండి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి.ఈ పోటీలలో మొత్తం 56 టీమ్ లు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు,సిబ్బంది , స్థానిక ప్రజలు ఉత్కంఠభరితంగా సుందరయ్య కాలనీ పెద్ద ఉట్లపల్లి జట్ల మధ్య సాగిన మ్యాచ్ ను ఆసక్తితో తిలకించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల నుండి యువత క్రీడల్లో జాతీయస్థాయి వరకు చేరుకొని ఈ ప్రాంతానికి,జిల్లాకి,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆశించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల అభివృద్ధి , సంక్షేమమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగాతెలియజేశారు. ప్రధానంగా విద్య,వైద్యం,రవాణా సౌకర్యాలను ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు అందేలా కృషి చేస్తూ వారికి మరింత చేరువయ్యేలా పోలీసు శాఖ తరపున అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ వాలీబాల్ టోర్నమెంట్లో పాల్గొని విజేతలుగా నిలిచిన జట్లకు అభినందనలు తెలియజేసారు. ఏజెన్సీ ప్రాంతాల్లో క్రీడల పట్ల ఆసక్తి మరియు మక్కువ ఉన్న క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు పోలీసులు శాఖ తరపున ఏర్పాటు చేస్తున్న ఇలాంటి క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తెలంగాణచత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే యువకులు అధిక సంఖ్యలో ఈ పోటీలలో పాల్గొనడం చాలా ఆనందకరంగా ఉందని తెలిపారు.నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ నాయకులు ఆదివాసీ ప్రజలలో ఆదరణ,నమ్మకం కోల్పోయారని అన్నారు.జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ఆదివాసీ ప్రజలకు అండగా ఉంటుందని,నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి ఎలాంటి సహాయ సహకారాలు అందించొద్దని సూచించారు.అనంతరం ఈ పోటీలలో మొదటి బహుమతిని గెలుచుకున్న చీమలపాడు,రెండవ బహుమతిని గెలుచుకున్న సుందరయ్య కాలనీ, మూడవ బహుమతిని గెలుచుకున్న పెదుట్లపల్లి , నాల్గవ బహుమతిని గెలుచుకున్న మామిడిగూడెం జట్లకు జిల్లా ఎస్పీ తమ చేతులమీదుగా బహుమతులను అందజేశారు.ఈ వాలీబాల్ పోటీలను ఇంత ఘనంగా ఏర్పాటు చేసిన చర్ల పోలీసులను సహకరించిన పీడి,పిఈటి లకు ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్,చర్ల సిఐ రాజువర్మ ఎస్సైలు నర్సిరెడ్డి,కేశవ, తదితరులు పాల్గొన్నారు



# మహిళలను.. కోటీశ్వరుని చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

* **నీలం పద్మ కృష్ణవేణి**

యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : దేశంలో మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేస్తూ మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, ఇన్చార్జి స్టేట్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి లకు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో మహిళా సభ్యత్వలలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో ఒక లక్ష 400 సభ్యత్వాలను చేసి అన్ని రాష్ట్రాల కంటే ముందు అంజలో నిలబడిన తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సభ్యత్వాల ద్వారానే పదవులు ఇవ్వడం జరుగుతుంది. మహిళా అభివృద్ధికి మహిళల బలోపేతానికి కృషి చేసినారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళ కు 6 గ్యారంటీలు భాగంగా అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, తాజాగాదేశంలో ఎక్కడ లేని విధంగా ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు సౌకర్యం కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం 500 కే గ్యాస్ సిలిండర్ గృహ అవసరాలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు మహిళా శక్తి పథకాలు ద్వారా మహిళలలో క్యాంటీన్లు పెట్టుకోవడానికి ఆర్థిక సహాయం అందించిందన్నారు. అతి వల్ల ఆర్థిక స్వాలంబని ప్రజా ప్రభుత్వం లక్ష్యం ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివాసం ఉంటారు.ఇందిరా మహిళా శక్తి 2025 మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ రేవంతన్న ప్రభుత్వం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రివ్యూ మీటింగ్ లో స్టేట్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, జనరల్ సెక్రెటరీ దివ్య సెక్రెటరీ కళ్యాణి జిల్లా రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది పదవులు వస్తాయని తెలియజేయడం జరిగింది.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్యపరంగా సేవలందిస్తున్న ఏఎన్ఎం లను మరియు ఆశ వర్కర్లకు. జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. స్టేట్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి జనరల్ సెక్రెటరీ దివ్య సెక్రెటరీ కళ్యాణి జిల్లా సభ్యులతో రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. సభ్యత్వాలు చేసిన వారికి పదవులు తప్పకుండా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సునీత జిల్లా ఉపాధ్యక్షురాలు నీరజ. జనరల్ సెక్రెటరీ లు వనజ రెడ్డి కవిత లక్ష్మి పరంజ్యోతి యాట విజయ సిద్ధి లక్ష్మి స్వరూప మాధవి నాగ లక్ష్మి ఝాన్సీ దీప రజిత పాము అనిత అన్నెపు పద్మ స్వాతి గుండు జ్యోతి కస్తూరి చింతకింది రేణుక జ్యోతి భానుమతి పద్మ ఎల్లమ్మ కేతమ్మ మండల కమిటీ మెంబర్లు. గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి లో వంద పడకల ఆసుపత్రిని నిర్మించాలి

* **మంత్రి దామోదర్ రాజనర్సింహ కి వినతి**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నియోజకవర్గం లో వంద పడకల ఆసుపత్రి నిర్మించాలని శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ కచ్చితంగా ఆస్పత్రి ఏర్పాటు గురించి తొందర్లోనే కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు మంచి శుభవార్త వింటారని హామీ ఇచ్చారు.అనంతరం శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ప్రజల ఇబ్బందులను పట్టించుకోలేదని, అందుకే ప్రజలు తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించి రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి చేశారన్నారు. రాబోయే రోజుల్లో లోకల్ బాడీ ఎలక్షన్లో కూడా కచ్చితంగా అన్ని సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని గంటాపదంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి సంజీవరావు, కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, మేకల మైకెల్, కోఆర్డినేటర్ తూము సంతోష్ కుమార్, దేవ సహాయం రవి, డివిజన్ అధ్యక్షుడు సతీష్ గౌడ్, కూకట్ పల్లి ఎస్సీ సెల్ బండిగ నరసింహ, కొమ్ము బాబురావు, రాజు ముదిరాజ్, రామకృష్ణారెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు..

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..

* **విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ మండలం పాత పాల్వంచ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలను ఆకస్మికంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో భోజనం చేస్తూ కలెక్టర్ వారితో మమేకమై వారి బాగోగులను భోజనం పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని తీసుకునే ముందు చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడగాలని ఆయన సూచించారు. ఆహారాన్ని వదిలివేయరాదని, చక్కని ఆరోగ్యానికి ఆహారం సహకరిస్తుందని ఆయన చెప్పారు. పౌష్టిక ఆహారం పట్ల అవగాహన పెంచుకోవాలని, పౌష్టికాహారాన్ని ముఖ్యంగా బాలికలు విధిగా తీసుకోవాలని కలెక్టర్ బోధించారు. ఆహార పదార్థాలను వృధా చేయరాదని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను బాగా గ్రహించాలని అందుకు ఏకాగ్రత అవసరమని కలెక్టర్ అన్నారు. పాఠ్యాంశాలలో సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వంట వండే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత్రలను ప్రతిరోజూ శుభ్రం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. చిన్నారులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. పాఠశాలకు మంజూరైన స్పోర్ట్స్ మెటీరియల్ కిట్లను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం అమలను సరళతరం చేసేందుకు, అనుకూలంగా భోజనం చేసేందుకు వీలుగా కిచెన్ సెట్, ఐరన్ పొయ్యి ఏర్పాటు, బల్లలు, బెంచీలు , విద్యార్థులకు ప్రత్యేకంగా లంచ్ బాక్స్ తో కూడిన బ్యాగ్ ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి, నివేదికలు అందించాల్సిందిగా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా కోఆర్డినేటర్ సైదులు, సతీష్ కుమార్, ఎంఈఓ రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినపుడే దేశాభివృద్ధి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిజాంపేట్ లోని సప్తపది గార్డెన్స్ లో ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినపుడే దేశాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని, ఇంట్లో ఒక పురుషుడు చదువుకుంటే ఆ ఇల్లు మాత్రమే అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక మహిళ చదువు ఆ కుటుంబంతో పాటు సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధన్ రాజ్ యాదవ్, గాజుల సుజాత, విజయలక్ష్మీ, నాయకులు సాంబశివా రెడ్డి, ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చలసాని భారతి, శ్రీలత, పద్మ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సాధన కోసం సిపిఎం పోరుబాటను విజయవంతం చేయండి

*** కల్లూరి మల్లేష్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**

యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : శుక్రవారం రోజున ఆలేరు పట్టణంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశము వడ్డేమాన్ బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల సాధన కోసంఈ నెల 4 న ప్రారంభమైనసిపిఎం పోరుబాటను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు పోరుబడ సందర్భంగా ప్రతి వార్డులోని ప్రజలను కలిసి ఇంటింటి సర్వే ద్వారా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని




అన్నారు ఆలేరు పట్టణ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు బీడీ కార్మికుల పెన్షన్లు వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్లు ఇవ్వకపోవడం వలన ప్రజలు చాలా అవస్థలు పడుతుందని అన్నారు అంతే కాకుండా ఆలేరు నియోజకవర్గ కేంద్రం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని మౌలిక వసతుల కల్పనలో పాలకవర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయని అన్నారు. గత సాధారణ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రధానంగా గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం, ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, ఆలేరు పట్టణ ప్రజలకు కలగానే మిగిలిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు రానున్న రోజుల్లో పోరుబాటలో భాగంగా పట్టణంలోని ప్రతి సమస్యను గుర్తించి వాటి సాధన కోసం జరిగే ప్రజా పోరాటాలలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, పట్టణ నాయకులు మోరిగాడి రమేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ మోరిగాడి చంద్రశేఖర్, ఘనగాని మల్లేశం, రాజేష్, కాసుల నరేష్ వడ్డేమాన్ విప్లవ్ మాదాని నవీన్ తదితరులు పాల్గొన్నారు

# జనరిక్ ఔషధం ఉత్తమం అపోహలు వద్దు

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా: జనరిక్ ఔషధం ఉత్తమం అపోహలు వద్దని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.జన్ ఔషధీ దివాస్ సందర్భంగా జమ్మిగడ్డ పి హెచ్ సి లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తక్కువ ధరకు జనరల్ మందులు జనరిక్ మెడికల్ షాప్ లో లభిస్తాయి అని ఆయన అన్నారు.ప్రతి ఏటా ఔషధీ దివస్ నీ జరుపుకోవడం అభినందనీయం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి , స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు డా. రమాదేవి డా. విజయ రాణి , లక్ష్మి నారాయణ పటేల్, కాసం మహిపాల్ రెడ్డి, కుమార్ స్వామి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఆస్తిపన్ను చెల్లింపు.. ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపు బకాయిదారులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 90 శాతం వడ్డీ మాఫీతో మొత్తం ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించేలా మరోసారి ఓటీఎస్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓటీఎస్ పథకాన్ని ఉపయోగించుకొని నగరంలోని ఆస్తి పన్ను మొండి బకాయిలున్న వారు పన్ను చెల్లించాలని సూచించారు. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటీఎస్‌లో మొత్తం పన్నుతోపాటు వడ్డీ 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. గతేడాది ప్రవేశపెట్టిన ఓటీఎస్ వల్ల సుమారు లక్ష మంది వినియోగదారులు ఆస్తి పన్ను




చెల్లించారు. జీహెచ్ఎంసీ.. ఈ సారి ఆస్తి పన్నుకు సంబంధించి రూ.2 వేల కోట్లు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం ఓటీఎస్‌కు అంగీకరించడంతో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలవుతాయని భావిస్తోంది.



# ఖలిస్థానీ శక్తులపై బ్రిటన్ 'ఉదాసీనత' కనబడుతోంది

*** విదేశాంగ శాఖ**

కేంద్ర మంత్రి జైశంకర్ బ్రిటన్ పర్యటనలో చోటుచేసుకున్న భద్రతా లోపంపై భారత విదేశాంగశాఖ మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన ఖలిస్థానీ ఉగ్రవాద శక్తుల బెదిరింపులపై 'బ్రిటన్ ఉదాసీనత'ను ప్రతిబింబిస్తోందని, వారి చర్యలకు వారికి లైసెన్సు ఇచ్చినట్లుగానే కనిపిస్తోందని పేర్కొంది. ఈ విషయంలో తమ ఆందోళనను యూకే అధికారులకు తెలియజేశామని తెలిపింది. బ్రిటన్ ప్రకటనపై స్పందిస్తూ.. దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తద్వారా బ్రిటన్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలిపింది. ''ఈ ఘటన వెనక సందర్భాన్ని అర్థం చేసుకోవాలి. బ్రిటన్‌లో మా దౌత్య కార్యకలాపాలకు ఆటంకం కలిగించే ఉద్దేశంతో చేసిన బెదిరింపులుగా చూడాలి. బెదిరింపు ధోరణికి పాల్పడే అటువంటి శక్తులపై ఉదాసీనతగా వ్యవహరించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది'' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో అన్నారు.

*** బంగ్లా పరిణామాలపై ఆందోళన..**

బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణిం చడం, తీవ్ర నేరాలకు పాల్పడిన వారిని విడుదల చేయడంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సుస్థిర, ప్రశాంత, సమ్మిళిత, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు మద్దతిస్తామని పేర్కొంది. ''తీవ్ర నేరాల్లో శిక్షను అనుభవిస్తున్న వారిని విడుదల చేయడం, బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి క్షీణిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. హిందువులు సహా ఇతర మైనారిటీలు, వారి ఆస్తులు, ప్రార్థనా మందిరాలకు రక్షణ కల్పించడం బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ బాధ్యత'' అని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# మౌలిక వసతుల కల్పనతోనే నియోజకవర్గం సమగ్రాభివృద్ధి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : మౌలిక వసతుల కల్పనతోనే సమాగ్రాభివృద్ధి సాధ్యమని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడి హిల్స్ ఏ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలలో మాలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపి రెడ్డి, మల్లేష్ గౌడ్, జైహింద్, మజ్జి శ్రీనివాస్, విఠల్ ముదిరాజ్, ముంతాజ్, అజం, నాని, నాగరాజు గౌడ్, మహేందర్, జయకృష్ణ, షిర్డి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శశిధర్ ముదిరాజ్, కాలనీ వాసులు బాబు గౌడ్, విఠల్ రెడ్డి, సత్యనారాయణ, నరసింహారెడ్డి, యాదిరెడ్డి, జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు.. కేంద్రంపై ఒత్తిడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, ఆర్ఆర్ఆర్ తదితర అంశాలపై విన్నవించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకు పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించే విధంగా ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లో ఈ నెల 8న (శనివారం) అన్ని పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఎంపీల సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈమేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో రాష్ట్రంలోని అందరు ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి భేటీకి ఆహ్వానించారు.



# ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక

**: ఎంపీ లక్ష్మణ్**

దిల్లీ: ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుందని ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. భారాస అనేది గత చరిత్ర అని పేర్కొ న్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా భాజపా ఎదిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులను పోటీలో పెట్టిన ఏకైక పార్టీ తమదని చెప్పారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న భారాసకు అభ్యర్థులను నిలబెట్టలేని




పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసగించిందని విమర్శించారు. ప్రజలను ఆర్థికంగా శక్తిమంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు.



# లోక్‌సభలో భారాస ఎంపీలు లేకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది : కేసీఆర్

సిద్దిపేట: ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా భారాస రజతోత్సవ వేడుకలు ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 27న లక్షలాది మందితో వరంగల్‌లో బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపారు. పలు కీలక అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ రజతోత్సవాలు, సంస్థాగత అంశాలు, భారాస సభ్యత్వ నమోదు, సంబంధిత అంశాలపై నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ''ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు మరింతగా పోరాడదాం. భారాస.. తెలంగాణ సమాజ రాజకీయ అస్తిత్వ పార్టీ. తెలంగాణకు రక్షణ కవచం భారాస. రజతోత్సవ వేడుకలో తెలంగాణ సమాజమంతా భాగస్వాములే. లోక్‌సభలో భారాస ప్రాతినిధ్యం లేకుండా పోయింది. భారాస ఎంపీలు లేకపోవడంతో రాష్ట్ర హక్కులకు భంగం కలుగుతోంది. తెలంగాణ ప్రజాప్రయోజనాలకు కేంద్రం, రాష్ట్రాలు దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొట్టాలి'' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

# అందుకే రోటి పచ్చళ్లే మంచివట!

**పల్లీ చట్నీ, నువ్వుల చట్నీ, కొబ్బరి చట్నీ, కరివేపాకు చట్నీ, వివిధ రకాల కాయగూరలు-ఆకుకూరలతో చేసుకునే చట్నీలు.. ఇలా ఏదో ఒక పచ్చడి లేనిదే మన భోజనం పూర్తి కాదు. బయట హోటల్లో భోంచేసినప్పుడు కూడా ఏదో ఒక చట్నీ వడ్డించడం మనం చూస్తూనే ఉంటాం. మన ఆహారపుటలవాట్లలో చట్నీకి ఉండే ప్రాధాన్యం అలాంటిది! మరి, అలాంటి చట్నీని తయారుచేసుకోవడానికి మనం ఏం ఉపయోగిస్తాం..? మిక్సీ లేదంటే వెట్ గ్రైండర్ కదూ! సులభంగా, త్వరగా చట్నీ చేయడం పూర్తవుతుంది కాబట్టే అందరూ వీటి పైనే ఆధారపడుతుంటారు. కానీ అదే సమయంలో రోట్లో రుబ్బుకున్న పచ్చడి అందించే రుచిని ఇది అందించలేదని కూడా అంటుంటారు మన పెద్దవాళ్లు. మరి, మిక్సీలో రుబ్బుకున్న పచ్చడి కంటే రోట్లో చేసుకున్న పచ్చడికి ఎందుకంత రుచి వస్తుంది? దానివల్ల మన ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటి? తెలుసుకుందాం రండి..**



ఇడ్లీ, దోసె, వడ.. వంటి టిఫిన్స్‌లోకే కాదు.. భోజనంలోకీ వివిధ రకాల పచ్చళ్లను తినడం మనలో చాలామందికి అలవాటు! అయితే మిక్సీ, వెట్ గ్రైండర్ వంటి గ్యాడ్జెట్స్ వచ్చాక మనకు ఆ పని మరింత తేలికైంది. కానీ ఇలాంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో రుబ్బుకున్న పచ్చళ్లలో కంటే రోట్లో నూరుకున్న పచ్చడిలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయంటున్నారు పోషకాహార నిపుణులు.

### వారానికి మూడుసార్లు!

మన భారతీయ పాకశాస్త్రంలో పచ్చళ్లది ప్రత్యేక స్థానం. మసాలాలు, ఫైబర్, ఫైటోన్యూట్రియంట్స్.. వంటి పోషకాలన్నీ వీటి ద్వారా మన శరీరానికి అందుతాయి. అందుకే వారానికి కనీసం మూడుసార్లు ఏదో ఒక పచ్చడిని ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది. మీకు మరో విషయం తెలుసా? పచ్చళ్లను భోజనంలో.. అది కూడా లంచ్‌లో భాగంగా తీసుకోవడం వల్ల మధ్యాహ్నం భోంచేశాక వచ్చే ఒక రకమైన నిద్ర మత్తు, అలసటకు దూరంగా ఉండచ్చట. ఇక చట్నీ చేసే క్రమంలో వీటిలో వాడే పదార్థాలన్నీ పచ్చడి బండతో ముక్కలు ముక్కలు చేయడం వల్ల వాటిలోని సూక్ష్మ పోషకాలు, స్టెరోల్స్, ఫ్లేవనాయిడ్స్.. మొదలైనవన్నీ బయటికి విడుదలవుతాయి. ఆ చట్నీని తినడం వల్ల అవన్నీ మన శరీరానికి బాగా పడతాయంటున్నారు పోషకాహార నిపుణులు.

### మిక్సీ/గ్రైండర్‌లో ఎందుకు వద్దు?!

చాలామంది చట్నీ అనగానే మిక్సీ/వెట్ గ్రైండర్‌లో చేసేస్తుంటారు. త్వరగా పని పూర్తవడంతో పాటు ఎలాంటి అసౌకర్యం లేకుండా సులభంగా చట్నీ చేసేయచ్చని వారు భావిస్తారు. నిజానికి ఇలా మిక్సీలో చట్నీ చేయడం వల్ల వాటిలోని పోషకాలన్నీ నశించిపోతాయి. అదెలాగంటే..

మనం పచ్చడి కోసం వాడే పదార్థాల్లో ఉండే కొన్ని సూక్ష్మ పోషకాలు వేడికి తట్టుకోలేవు. కాబట్టి మిక్సీ/గ్రైండర్‌లో పచ్చడి చేసే క్రమంలో ఉత్పత్తయ్యే వేడి వల్ల ఇవన్నీ నశించిపోతాయి. అదే రోట్లో రుబ్బుకునే పచ్చళ్ల కోసం పచ్చడి బండను ఉపయోగిస్తుంటాం. ఇది ఉష్ణ నిరోధకం కాబట్టి పచ్చడి చేసే క్రమంలో వేడి పుట్టకుండా అందులోని పోషకాలన్నీ అలాగే నిక్షిప్తమై ఉంటాయి. ఇలా రోట్లో చేసే పచ్చడి వల్ల ఆయా పదార్థాల్లోని సుగుణాలన్నీ మన శరీరానికి అందుతాయి.. అలాగే చక్కటి రుచినీ ఆస్వాదించవచ్చు.





# జుట్టు రాలుతోందా?

## అయిదు చిట్కాలతో.. అందంగా..!

**జుట్టు విపరీతంగా రాలిపోవడం అనేది ఈ మధ్య చాలామంది అమ్మాయిలు ఎదుర్కొంటోన్న సమస్య. వయసుతో సంబంధం లేకుండా ఎంతోమందిని ఈ సమస్య వేధిస్తోంది. ఈ క్రమంలో- ఈ సమస్యను పరిష్కరించగలిగే కొన్ని చిట్కాల గురించి తెలుసుకుందాం రండి..**



**ఈ మిశ్రమంతో..**

కప్పు ఆముదం నూనెలో టీస్పూన్ రోజ్‌మేరీ నూనె వేసి బాగా కలపాలి. ఈ నూనెల మిశ్రమాన్ని ఒక గ్లాస్ జార్‌లో భద్రపరచుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు ఈ నూనెను కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి కాసేపు మర్దన చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తున్నట్లయితే జుట్టు రాలిపోయే సమస్య తగ్గుముఖం పట్టడం కొన్ని రోజుల్లోనే గమనించచ్చు.. అంతేకాదు.. జుట్టు ఒత్తుగా పెరిగేం దుకూ ఈ నూనె తోడ్పడుతుంది.

**కొబ్బరి పాలతో సిల్కీగా!**

గరుకుగా, గడ్డిలా మారిన జుట్టును రిపేర్ చేయడానికి కండిషనర్ చక్కగా ఉపయోగపడుతుంది. అయితే ఇందు కోసం బయట దొరికేవి కాకుండా మన వంటింట్లో ఉండే కొబ్బరి పాలను ఉపయోగిస్తే తక్షణ ఫలితం ఉం టుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొన్ని కొబ్బరి పాలలో కొద్దిగా ఆర్గన్ ఆయిల్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి.. షవర్ క్యాప్ పెట్టుకోవాలి. మరుసటి రోజు ఉదయం షాంపూ చేసుకుంటే జుట్టు మృదువుగా, సిల్కీగా మారడం గమనించచ్చు.

**ఇవి గుర్తుపెట్టుకోండి!**

* కొబ్బరి నూనెను కాస్త వేడి చేసి.. పడుకునే ముందు కుదుళ్లు, జుట్టుకు పట్టించాలి. కాసేపు కుదుళ్లను మర్దన చేసి షవర్ క్యాప్ పెట్టుకోవాలి. మరుసటి రోజు ఉదయం గాఢత తక్కువగా ఉండే షాంపూతో తల స్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుంది.
* జుట్టు వదిలేసుకొని నిద్ర పోతుం టారు కొంతమంది. తద్వారా కేశాలు గడ్డిలా, పిచ్చుక గూడులా మారతాయి. అందుకే జుట్టు ఆరో గ్యాన్ని కాపాడుకోవాలంటే జడ వేసు కోవడం, పైకి ముడేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఫలితంగా జుట్టు రాలే సమస్య కూడా అదుపులోకొస్తుంది. వీటితో పాటు తీసుకునే ఆహారంలో 'ఎ', 'బి', 'సి', 'డి', 'ఇ'.. వంటి విటమిన్లు ఉండేలా చూసుకోవడమూ ముఖ్యమే!



**వ్యాయామం చేయండి..**

వ్యాయామాలు, వర్కవుట్లను జీవనశైలిలో భాగం చేసుకుంటే శరీర ఆరోగ్యంతో పాటు చర్మ సౌందర్యాన్ని సం రక్షించుకోవచ్చు. వ్యాయామాలు చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ బాగుంటుంది. రన్నింగ్, యోగా, హై ఇంటెన్సిటీ ఇంటర్వల్ ట్రైనింగ్.. లాంటి వ్యాయామాలను వారంలో 5 రోజుల చొప్పున కనీసం 30 నిమిషాల పాటు చేస్తే రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరు మెరుగవుతుంది.



**హెల్దీ ఫుడ్స్..**

చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉన్న పదార్థాలను ఆహారంగా తీసుకోకపోవడం ఎంతో ఉత్తమం. వీటి స్థానంలో ఆకుపచ్చని కూరగాయలు, వివిధ రకాల పండ్లను డైట్‌లో భాగం చేసుకుంటే బాగుంటుంది. ఇందులో సమృద్ధిగా ఉండే ఫైబర్ రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంతో పాటు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

**ఫ్లూయిడ్స్ ఎక్కువగా..**

ఎలాంటి రసాయన ఉత్పత్తులు వాడకుండా సహజమైన పద్ధతుల్లో అందంగా మెరిసిపోవాలంటే మంచినీటికి మించిన సాధనం మరొకటి లేదు. చర్మ సౌందర్య నిపుణులు కూడా ఎక్కువగా ఇదే మాట



చెబుతుంటారు. శరీరంలో నీటి శాతం తగ్గడం వల్ల విషతుల్యాలు, హానికారక పదార్థాలు పెరిగిపోతాయి. ఈ ప్రభావం కచ్చితంగా చర్మంపై పడుతుంది. కాబట్టి ఎప్పటికప్పుడు శరీరంలో తగినంత నీటి స్థాయులు ఉండేలా జాగ్రత్త పడాలి. ఈ క్రమంలో మంచి నీటితో పాటు కొన్ని రకాల ఫ్రూట్ జ్యూస్‌లను తీసుకున్నా మంచి ఫలితముంటుంది.

## పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్న

# నాగచైతన్య దంపతులు

### హనీమూన్‌కు వెళ్లిన చైతన్య,శోభిత..



టాకీస్: 'తండేల్' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న నాగ చైతన్య ప్రస్తుతం తన పర్సనల్ లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నాడు. పెళ్లి అయిన అనంతరం తొలిసారి తన భార్య శోభితా ధూళిపాళ్లతో కలిసి ఇంటర్ నేషనల్ ట్రిప్ యూరప్ వెకేషన్‌కు వెళ్లగా.. ఇందుకు సంబంధించిన ఫొటోలను శోభితా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఇద్దరి కలిసి ఫుడ్ తింటున్న ఒక ఫొటోను పోస్ట్ చేయడంతో పాటు దీనికి 'వైబ్స్' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం వైరలవుతున్న ఈ ఫొటోను మీరు చూసేయండి. సమంతతో విడాకుల అనంతరం చైతూ శోభితాతో ప్రేమలో పడిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న ఈ జంట డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వివాహం చేసుకున్నారు. అయితే పెళ్లి అయిన అనంతరం నాగ చైతన్య తండేల్ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉండడంతో ట్రిప్ వెళ్లకుండా సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేసింది ఈ జంట. ఇప్పుడు సినిమాల నుంచి విరామం తీసుకున్న చైతూ తాజాగా హనీమూన్ ట్రిప్ వెళ్లినట్లు తెలుస్తుంది. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవల తండేల్‌తో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన చైతూ ప్రస్తుతం విరుపాక్ష దర్శకుడు కార్తీక్ వర్మ దండుతో ఒక సినిమా చేయబోతున్నాడు. మైథాలాజికల్ సైన్స్ ఫిక్షన్‌గా రాబోతున్న ఈ చిత్రం త్వరలోనే పట్టాలెక్కనుంది.

## దిల్‌రుబాకు మీ మాజీ ప్రేయసితో

# వెళ్లకండి : కిరణ్ అబ్బవరం

టాకీస్: 'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నటుడు కిరణ్ అబ్బవరం మరో క్రేజీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మార్చి 14, 2025న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదలకు వారం కూడా లేకపోవడంతో తాజాగా చిత్రబృందం ట్రైలర్ వేడుకను నిర్వహించింది. ఈ వేడుకలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "దిల్ రూబా సినిమాకి వీలైతే మీ లవర్‌తో, కొద్దిగా కష్టంగా ఉంటుంది కానీ మీ ఎక్స్‌తో సినిమాకి వెళ్ళండి. బయటికి వచ్చేటప్పుడు మీరు మీ లవర్, మీ ఎక్స్ ముగ్గురూ చాలా హ్యాపీగా ఫ్రెండ్‌షిప్‌తో బయటికి వస్తారు అంటూ చెప్పుకొచ్చాడు. ఎక్స్ మీద మనకు ప్రేమ పోవచ్చు కానీ ఫ్రెండ్‌షిప్ అలానే ఉంటుంది. అందుకే ఈ సినిమాను వారితో కలిసి చూడండి అంటూ" చెప్పుకొచ్చాడు. అయితే కిరణ్ కామెంట్లపై నెటిజన్లు వింతంగా స్పందిస్తున్నారు. మా ఎక్స్ భర్తను కిరణ్ ఒప్పిస్తాడా అంటూ కామెంట్లు పెడుతున్నారు.



## రెడ్ డ్రెస్‌లో ఫోజులిచ్చిన

# అందాల భామ శృతిహాసన్

టాకీస్: అందాల ముద్దుగుమ్మ స్టార్ సీనియర్ హీరో కుమార్తె శృతిహాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అనగనగా ఓ ధీరుడు సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ, అనతికాలంలోనే స్టార్ స్టేటస్ అందుకుంది. ఈ మూవీ తర్వాత శృతిహాసన్ చేసిన ప్రతీ సినిమా హిట్ అందుకుంది. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన గబ్బర్ సింగ్ సినిమాలో నటించి ఈ బ్యూటీ మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమా తర్వాత ఈ అమ్మడుకు అనేక అవకాశాలు వచ్చాయి. వచ్చిన ప్రతి ఆఫర్‌ను అందిపుచ్చుకొని, స్టార్ హీరోయిన్‌గా టాలీవుడ్‌నే షేక్ చేసింది ఈ బ్యూటీ. ఇక రీసెంట్‌గా ప్రభాస్ సలార్ మూవీలో నటించి పాన్ ఇండియా స్టార్ అయిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు నాలుగు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ వరస ఫొటో షూట్స్‌తో తన అభిమానుల మనసు దోచేస్తుంటుంది. తాజాగా ఈ చిన్నది రెడ్ కలర్ డ్రెస్‌లో తన అందాలతో కుర్రకారుకు విందు భోజనం పెట్టింది. ఎప్పుడూ, ఎక్కువగా బ్లాక్ డ్రెస్‌లో కనిపించే ఈ బ్యూటీ.తాజాగా రెడ్ కలర్ డ్రెస్‌లో పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. అందులో శృతిహాసన్ చాలా అందంగా కనిపించింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక నటనతోనే కాకుండా శృతిహాసన్ సింగర్‌గా కూడా తన సత్తాచాటుతోంది. చాలా సినిమాల్లో ఈ బ్యూటీ పాటలు పాడి, తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.





# అచ్చం అప్సరసే..

## వైట్ అండ్ గోల్డ్ డ్రెస్‌లో అదరగొడుతున్న సోనమ్‌కపూర్

టాకీస్: ఈ మధ్య హీరోయిన్స్ సోషల్ మీడియలో చాలా యాక్టివ్‌గా ఉంటూ తమ అభిమానులతో ముచ్చటిస్తున్నారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్ కు వరస ఫొటోషూట్స్‌తో మంచి కిక్కి ఇస్తున్నారు. ఈ క్రమలోనే బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్ కూడా తన అందచందాలతో ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ వైట్ అండ్ గోల్డ్ డ్రెస్‌లో తన అందాలతో మతిపోగొడుతుంది. మరి వాటిపై ఓ లుక్ వేద్దాం పదండి! బాలీవుడ్ బ్యూటీ సీనియర్ స్టార్ హీరోయిన్, సోనమ్ కపూర్ గురించి, ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 2007లో సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన సావరియా అనే సినిమా ద్వారా బాలీవుడ్ వెండితెరపైకి అడుగు పెట్టింది ఈ ముద్దుగుమ్మ. అనిల్ కపూర్ కుమార్తె అయిన ఈ బ్యూటీ అనతి కాలంలోనే వరసగా సినిమాలు చేస్తూ, స్టార్ స్టేటస్ అందుకుంది. తన నటన, అందంతో మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తన అందంతో కుర్రకారును మాయ చేస్తుంటుంది. వైట్ అండ్ గోల్డ్ డ్రెస్‌లో సోనమ్ కపూర్ అదిరిపోయిందంటూ తన ఫ్యాన్స్ నెట్టింట కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కాగా, మీరు కూడా ఈఫొటోస్ పై ఓ లుక్ వేయండి మరి.

# సినీప్రియులకు కర్ణాటక ప్రభుత్వం గుడ్‌న్యూస్

### రూ.200లకే సినిమా టికెట్లు పరిమితం

టాకీస్: సినిమా ప్రియులకు కర్ణాటక ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో సినిమా టికెట్లను రూ.200కే పరిమితం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో సీఎం సిద్ధరామయ్య కీలక ప్రకటన చేశారు. 2025-26కు సంబంధించిన కర్ణాటక బడ్జెట్‌ను నేడు ప్రవేశపెట్టారు. రూ.4,08,647 కోట్ల బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకువచ్చారు. మౌలిక సదుపాయాలు, సినిమా ప్రమోషన్స్, మహిళా సాధికారికత వంటి అంశాల గురించి ఈసారి బడ్జెట్‌లో కీలకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా ఈ బడ్జెట్‌లో సినీ రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలను ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్స్ థియేటర్లలో సినిమా టికెట్ ధరను రూ.200కే పరిమితం చేస్తున్నట్లు చెప్పారు. సామాన్యులకు కూడా సినిమాను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా కన్నడ సినిమాల ప్రచారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ని కూడా తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీఎం ప్రకటించారు.




# కంఫర్ట్ లేదన్న ఫోటోలు తీస్తారా..?

### జర్నలిస్టులపై రుక్సార్ థిల్లాన్ ఆగ్రహం

టాకీస్: టాలీవుడ్ యువ నటి రుక్సార్ థిల్లాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. కన్నడ చిత్రం "రన్ ఆంటోని"తో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈ భామ.. తెలుగులో 'ఆకతాయి' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ సినిమా బ్రేక్ ఇవ్వకపోగా.. నాని నటించిన 'కృష్ణార్జున యుద్ధం' సినిమాలో హీరోయిన్‌గా నటించి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించడమే కాకుండా, ఆమె నటనకు విమర్శకుల నుండి సానుకూల స్పందనలు లభించాయి. అనంతరం 'ఏబీసీడీ', 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది ఈ భామ. అయితే రుక్సార్ థిల్లాన్ నటిస్తున్న తాజా చిత్రం దిల్ రూబా. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తుండగా.. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ వేడుకను నిర్వహించారు మేకర్స్. అయితే ఈ చెప్పినా కూడా ఫోటోలు తీస్తారా? అంటూ జర్నలిస్టలను ప్రశ్నించింది. ప్రేమతో కూడా చెప్పాను ఫోటోలు తీయవద్దు నేను కంఫర్ట్‌గా లేనని అయిన కూడా వినట్లేదు. నేను పేర్లు చెప్పలేను కానీ ఇంకోసారి ఇలా చేయకండంటూ" రుక్సార్ చెప్పుకొచ్చింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.